క్లుప్తంగా

గంగమ్మ తల్లికి కుంకుమార్చన



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

తాళ్లూరు: మండలంలోని తూర్పు గంగవరం పంచాయతీ పరిధిలోని సోమవరప్పాడులో గుంటి గంగా భవానీ అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు మెట్టేల బాలరాజు, పి.విజయలక్ష్మిలు అమ్మవారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ బ్రాహ్మణ అర్చకుడు కామేశ్వరశర్మ అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన పూజలు చేశారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. భక్తులు కానుకలు సమర్పించారు. జిల్లాలోని అనేక ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయం పక్కన ఉన్న పుట్ట, నాగశిలలను, శ్రీ మల్లికార్జునస్వామివారిని పూజించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈఓ జి.వాసుబాబు, చైర్మన్ కె.గురుబ్రహ్మం, ఏఆర్‌కే ప్రసాద్, సిబ్బంది పర్యవేక్షించారు.

పోలేరమ్మతల్లికి ప్రత్యేక పూజలు

మార్కాపురం టౌన్: పట్టణ శివారులో కొలువై ఉన్న అల్లూరి పోలేరమ్మ తల్లి దేవస్థానంలో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు వండి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించారు. పట్టణం నుంచేకాక పరిసర గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

కాన్పు కష్టమే..

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సౌకర్యాల కొరత
- పీహెచ్‌సీల్లో గర్భిణులకు అందని వైద్యసేవలు
- మెరుగైన వైద్యం కోసం మండల కేంద్రానికి చేరే లోపే 108 వాహనాల్లో ప్రసవాలు
- ఇప్పటి వరకు 30 మందికి పైగానే 108లో ప్రసవాలు

పెద్దదోర్నాల: బిడ్డకు జన్మనివ్వటం పునర్జన్మ లాంటిది. నేటికీ కొన్ని చోట్ల ఆస్పత్రికి వచ్చే లోపుగానే మార్గంలోనే పురిటి నొప్పులు అధికమై అంబులెన్స్ వాహనాల్లోనే చిన్నారులకు జన్మనిస్తున్నారు. ప్రసూతి వార్డుల్లో గర్భిణులు పూర్తి భరోసా మధ్య బిడ్డను కనాల్సి ఉన్నా పలు కారణాలతో ఆయా సేవలకు దూరం అవుతున్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి ప్రవేశ పెట్టిన 108 వాహనాల ద్వారా వైద్యశాలల్లో, మార్గ మధ్యంలో వందలాది మంది తల్లులు తమ బిడ్డలకు జన్మనిచ్చారు. 108 వాహనాలు ప్రవేశపెట్టినప్పటి నుంచి మండల పరిధిలో 30 మంది వరకు గర్భిణులు మార్గ మధ్యంలోనే 108 వాహనాల్లో ప్రసవించారు.

స్కానింగ్, గైనకాలజిస్టు సౌకర్యం లేక..

మండల పరిధిలోని చింతల, కొర్రప్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో స్కానింగ్ యంత్రాలు, గైనకాలజిస్టుల కొరత ఉండటంతో గర్భిణులు మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది. మరి కొందరు ప్రైవేటు స్కానింగ్ కేంద్రాలకు వెళుతుండటంతో ఖర్చు పెరుగుతోంది. సేఫ్ మదర్ క్యాలెండర్ లేకపోవటంతో పాటు, స్కానింగ్ రిపోర్ట్‌ను సరిగా విశ్లేషించక పోవటంతో కడుపులో బిడ్డ తీరు, ప్రసవించే తేదీ సరిగా నమోదు చేయకపోవటంతో తీవ్రమైన నొప్పులతో హడావుడిగా వైద్యశాలలకు పరిగెత్తాల్సి వస్తోంది. దీంతో పాటు గర్భిణులను అటూ, ఇటూ వాహనాల్లో తిప్పేసరికి దారిలోనే ప్రసవం అయిన సంఘటనలు ఉన్నాయి.



మండల పరిధిలో ఇటీవల 108 వాహనంలోనే కాన్పు అయిన మహిళ

గర్భిణులకు అవగాహన లేక....

మండల పరిధిలోని చింతల, కొర్రప్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సిబ్బంది కొరతతో పాటు సౌకర్యాల లేమితో గర్భిణులను మండల కేంద్రమైన పెద్దదోర్నాలలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి కాన్పుల నిమిత్తం పంపిస్తున్నారు. దీంతో పాటు కొన్ని కుటుంబాల్లో అవగాహన లేకపోవటంతో పురిటి నొప్పులు వచ్చేంత వరకు ఇళ్లలోనే ఉంటున్నారు. మండల పరిధిలోని మర్రిపాలెం, బందంబావి, అయ్యన్నకుంట తదితర గ్రామాల్లో రహదారులు అధ్వానంగా ఉండటంతో సకాలంలో వైద్యశాలలకు వెళ్లలేక దారిలోనే ప్రసవించిన సంఘటనలు ఉన్నాయి.

సమన్వయ లోపంతో ఇబ్బందులు

సిబ్బందికి, గర్భిణీ కుటుంబ సభ్యులకు అవగాహన లేకపోవటం వల్లే దారిలోనే కాన్పులు జరిగే అవకాశం ఉంది. ఒక్కో సారి నెలలు నిండక ముందే, నెలలు నిండిన తరువాత సహజ ప్రసవాలు జరుగుతుంటాయి. తల్లీ బిడ్డల క్షేమం కోసం అవగాహన పెంచుకోవటం అత్యంత ప్రాధాన్యం.

– వైద్య సంజీవ్, సూపరింటెండెంట్, సామాజిక ఆరోగ్య కేంద్రం, పెద్దదోర్నాల

750 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

దర్శి (కురిచేడు): దర్శి రోటరీ క్లబ్, ఎస్డీఆర్ మార్కెటింగ్ సౌజన్యంతో ఆదివారం నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 750 మంది పాల్గొని కంటి పరీక్షలు చేయించుకున్నారు. గుంటూరు పెదకాకాని శంకర్ కంటి ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ చింతన్ కంటి పరీక్షలు నిర్వహించారు. సుగర్, బీపీ పరీక్షలు చేసి కంటి శస్త్రచికిత్సలు అవసరమైన 420 మందిని శంకర కంటి ఆస్పత్రికి తీసుకెళ్లి శస్త్రచికిత్సలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మొదటిగా 200 మందిని ఆదివారం శంకర ఆస్పత్రికి తరలించారు. మిగతా 220 మందిని మంగళవారం శంకర ఆస్పత్రికి తీసుకెళ్లి శస్త్ర చికిత్సలు చేస్తారని నిర్వాహకుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఇన్‌చార్జి నాగబాబు, పారామెడికల్ సిబ్బంది, రోటరీ సభ్యులు కేవీ రెడ్డి, అంబవరపు నారాయణరెడ్డి, డాక్టర్ కోటిరెడ్డి, మారం శివకోటిరెడ్డి, ఎదురు నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు అనువైన కంది రకాలు ఉపయోగించండి



ఖరీఫ్‌కు అనుకూలమైన కంది రకాల గురించి వివరిస్తున్న సంధ్యారాణి

ముండ్లమూరు (కురిచేడు): ఖరీఫ్‌లో కంది పంట సాగుచేసే రైతులంతా అనువైన రకాలైన ఎల్ఆర్‌జీ 52, బీఎంఎస్ఆర్ 736 రకాలను ఉపయోగించుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం నోడల్ అధికారి కే సంధ్యారాణి సూచించారు. ముండ్లమూరు మండలంలోని వేముల, కమ్మవారిపాలెం గ్రామాల్లో ఆదివారం వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ కంది పంటకు సోకే ఎండుతెగులు, బూజు తెగులు నివారణ, వాటి సస్యరక్షణ పద్ధతుల గురించి వివరించారు. అదే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల అభ్యున్నతికి చేయూతగా అందించే వివిధ రకాల పథకాలైన పీఎం కిసాన్, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, ప్రధానమంత్రి ముద్ర యోజన, మొదలైన పథకాల గురించి వివరించారు. భూసార పరీక్షలు, యాజమాన్యం, వరి పంటలో రకాలు, సస్యరక్షణ పద్ధతులు, తెగుళ్లను తట్టుకునే రకాల గురించి బాపట్ల శాస్త్రవేత్త ఎం.ఉష తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే పథకాలు, సబ్సిడీలు, ఈ క్రాప్ బుకింగ్, సీసీఆర్సీ కార్డుల గురించి మండల ఏఈఓ కీర్తి వివరించారు. కార్యక్రమంలో ఆత్మ బీటీఎం రామిరెడ్డి, హెచ్ఈఓ స్వర్ణలత, వీఏఏలు వీవీ నిర్మల, ఏపీ ఎస్ఎఫ్‌జే ప్రభాకర్, రైతులు పాల్గొన్నారు.

ఆలయాల్లో భక్తుల పొంగళ్లు

పెద్దారవీడు: మండలంలోని గుండంచర్ల గ్రామం సమీపంలో నల్లమల అడవిలో వెలసిన గంగా భవానీ వేసూతల కాటమరాజుస్వామి, పెద్దారవీడు గ్రామం సమీపంలో వెలసిన శ్రీ అంకాళమ్మ దేవత, ఎస్ కొత్తపల్లి గ్రామం సమీపంలో వెలసిన శ్రీనాగాంజనేయస్వామి పుట్టకు భక్తులు భక్తిశ్రద్ధలతో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. కాటమరాజుస్వామి, గంగభవానీ దేవతకు అభిషేకాలు, పూజలు చేసి పట్టువస్త్రాలు, పసుపు, కుంకుమ, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు అంకాళమ్మ దేవతకు మహిళలు పసుపు, కుంకుమ, చీరలు, గాజులు, నాగమయ్యపుట్టకు పాలు, పండ్లు సమర్పించారు. అంకాళమ్మ దేవతను పట్టువస్త్రాలు, ఆభరణాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు ఆలయం ప్రాంగణంలో పొంగళ్లు తయారు చేసి స్వామి, అమ్మవార్లకు నైవేద్యం చెల్లించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని, మొక్కులు చెల్లించారు.



ప్రత్యేక అలంకరణలో వేసూతల కాటమరాజుస్వామి

కోట సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కోట సత్యమాంబదేవి

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్లు సమీపంలోని కోటసత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోట సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని, సత్యమణికంఠేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించి, అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు.



జెడ్పీ హైస్కూల్లో అసంపూర్తిగా ఉన్న అదనపు గదుల నిర్మాణం



మార్కాపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో అర్ధంతరంగా ఆగిన తరగతి గదుల నిర్మాణం

నిధులకు కొర్రీ.. స్కూళ్ల అభివృద్ధికి ఉరి!

- ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులకు పైసా విదల్చని కూటమి ప్రభుత్వం
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మనబడి నాడు.. నేడు కింద రూ.58.76 కోట్ల ఖర్చు
- అర్ధంతరంగా ఆగిన పనులను కొనసాగించకుండా కూటమి సర్కారు మీనమేషాలు
- వారం రోజుల్లో పాఠశాలలు పునఃప్రారంభమవుతున్నా అదే నిర్లక్ష్యం

మార్కాపురం టౌన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి పైసా విదల్చలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాడు–నేడు కింద చేపట్టిన పనులను కొనసాగించకుండా ఉద్దేశపూర్వకంగా నిలిపివేసి చోద్యం చూస్తోంది. వారం రోజుల్లో ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కానీ అరకొర వసతుల మధ్య పేద, మధ్య తరగతి పిల్లలు చదువుకునే దుస్థితిని కూటమి ప్రభుత్వం కల్పిస్తోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గత ప్రభుత్వంలో నాడు.. నేడు కార్యక్రమం కింద అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలనూ అభివృద్ధి చేశారు. మార్కాపురం నియోజకవర్గంలో ఫేజ్–1లో భాగంగా కొన్ని పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, డిజిటల్ క్లాస్ రూములు, మరుగుదొడ్లు, నీటి సదుపాయం, విద్యుత్ తదితర సమస్యలపై దృష్టిసారించి అభివృద్ధి చేశారు. ఫేజ్–2లో భాగంగా మరికొన్ని పాఠశాలలను ఎంపిక చేసి కొంతమేర నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. ఈ క్రమంలో ఎన్నికలు రావడం, కూటమి ప్రభుత్వం గద్దెనెక్కడంతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. స్కూళ్లలో నిలిచిన అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం.. ఏడాది అవుతున్నా నిధులివ్వకపోవడంతో అసంపూర్తి నిర్మాణాలు దర్శనమిస్తున్నాయి.

మార్కాపురం నియోజకవర్గంలో 299 ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 30,407 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. నాడు–నేడులో ఫేజ్–1, 2 కింద 226 పాఠశాలలు ఎంపిక చేశారు. ఈ పాఠశాలల్లో అభివృద్ధి కోసం రూ.58.76 కోట్లు ఖర్చు చేశారు. కొనకనమిట్ల మండలంలో 25 పాఠశాలల్లో నాడు నేడు భవనాలు అసంపూర్తిగా మిగిలిపోయాయి. మార్కాపురం పట్టణ, రూరల్‌లో 32 పాఠశాలల భవనాలు కూడా అర్ధంతరంగా ఆగిపోయాయి. పొదిలి మండలంలో 17 పాఠశాలల్లో నిధులు మంజూరు కాక పనులు నిలిచిపోయాయి. తర్లుపాడు మండలంలో 18 పాఠశాలల్లో భవనాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. తర్లుపాడు మండలంలోని తుమ్మలచెరువు జెడ్పీ హైస్కూల్లో అదనపు తరగతి గదులు, పొదిలి పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల భవనాలు, కొనకనమిట్ల మండలంలోని పేరారెడ్డిపల్లి యూపీ పాఠశాలలో అదనపు గదుల నిర్మాణం నిధుల కొరత కారణంగా నిలవడంతో దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. ఈ విద్యా సంవత్సరంలోనైనా పాఠశాలల్లో భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించి, పనులు పూర్తి చేయాలని విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.



తర్లుపాడు మండలం తుమ్మలచెరువు జెడ్పీ హైస్కూల్లో నిలిచిన తరగతి గదుల నిర్మాణం

ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలి

ప్రభుత్వ పాఠశాలల్లో అసంపూర్తిగా నిలిచిన నిర్మాణాలకు నిధులు కేటాయించి పూర్తి చేయాలి. పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించి మెరుగైన విద్యా బోధనకు ప్రభుత్వం కృషి చేయాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ పాఠశాలలకు వస్తున్న పేద, మధ్య తరగతి విద్యార్థులు ఆహ్లాదకర వాతావరణంలో చదువుకునేలా చూడాలి.

– గాలి వెంకట్రామిరెడ్డి, రైతు సంఘ నాయకుడు

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



తూర్పుగంగవరం జూనియర్స్ జట్టుకు బహుమతి అందిస్తున్న వెంకట కృష్ణారెడ్డి

తాళ్లూరు: మండలంలోని తూర్పు గంగవరం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో రామభద్రపురం గ్రామ ఎద్దుల బీడు వద్ద జరుగుతున్న మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. విజేతలుగా నాగంబొట్లపాలెం జట్టు నిలిచింది. ద్వితీయ బహుమతిని తూర్పు గంగవరం జట్టు, మూడో బహుమతిని మాధవరం జట్టు, నాలుగో బహుమతిని తూర్పు గంగవరం జూనియర్స్ జట్టు కైవసం చేసుకున్నాయి. విజేతలుగా నిలిచిన జట్లకు కైపు వెంకట కృష్ణారెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందించారు. నిర్వాహకులు వెంకటేష్, కోటేశ్వరరావు, రవి, బాలు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గ్రామోత్సవం

రాచర్ల: మండలంలోని యడవల్లి గ్రామంలో శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం మోహిని అవతారంలో స్వామివారి గ్రామోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. తొలుత స్వామివారిని అర్చకులైన కందనూరి హరీష్‌కుమార్, కందనూరి పార్థసారిథి, నంద్యాల శ్రీనివాసచార్యులు ఆధ్వర్యంలో మోహినిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్త మార్కాపురం సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు పిడతల ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

నేడు సచివాలయం ప్రారంభం

రాచర్ల: మండల కేంద్రమైన రాచర్ల గ్రామంలో నిర్మాణం పూర్తి చేసుకున్న గ్రామ సచివాలయ భవనాన్ని సోమవారం ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీఓ ఎస్.వెంకటరామిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున మండల అధికారులతో పాటు ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు తప్పకుండా హాజరు కావాలని సూచించారు.

వెబ్ కౌన్సెలింగ్‌ను బహిష్కరించిన టీచర్లు



కొమరోలు ఎమ్మార్సీలో ఖాళీగా ఎంఈఓ వెంకటరత్నం, సిబ్బంది

కొమరోలు: మండలంలోని ఎంపీపీ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఎస్‌జీటీ ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ ఆదివారం మొదలైంది. రాష్ట్రంలోని ఉపాధ్యాయులందరూ మాన్యువల్ రూపంలో ఎస్‌జీటీ ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ చేపట్టాలని ఉన్నతాధికారులకు విన్నవించారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం వెబ్ కౌన్సెలింగ్ చేపట్టింది. దీంతో కొమరోలు మండలంలో బదిలీలకు అర్హత కలిగిన 47 మంది ఎస్‌జీటీలు యూటీఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు వెబ్ కౌన్సెలింగ్‌ను బహిష్కరించారు. స్థానిక ఎమ్మార్సీకి ఒక్క ఉపాధ్యాయుడు కూడా హాజరు కాకపోవడంతో ఎంఈఓ వెంకటరత్నం, ఎంఐఎస్ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, కంప్యూటర్ డేటా ఆపరేటర్ రవీంద్రరెడ్డి ఖాళీగా కూర్చోవాల్సి వచ్చింది.

వైభవంగా అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

పొదిలిరూరల్: పొదిలి మండలం జువ్వలేరులో పట్టాభిరామస్వామి దేవస్థానంలో అభయ ఆంజనేయ స్వామి సహిత ధ్వజ ప్రతిష్ఠ, గమిడి దేవతల సహిత గ్రామ శీతల యంత్ర ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆగమ పండితుల ఆధ్వర్యంలో విశేష పూజలు, శాంతి కల్యాణం చేశారు. జువ్వలేరుతోపాటు చుట్టుపక్కల గ్రామాల భక్తులు హాజరై స్వామి వారికి మొక్కులు చెల్లించారు.



జువ్వలేరులో ప్రతిష్ఠించిన ధ్వజ స్తంభం